పార్కు ప్రారంభించేదెప్పుడో..

- పది నెలలుగా మూసి ఉన్న దానవాయిపేట గాంధీ పార్క్
- రూ.2.5 కోట్లతో ఆధునీకరణ పనులు


దానవాయిపేట గాంధీ పార్కు ముఖ ద్వారం

రాజమహేంద్రవరం సిటీ: నగరం నడిబొడ్డున దానవాయిపేట మెయిన్ రోడ్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపల్ గాంధీ పార్క్ ఎప్పుడు పునఃప్రారంభమవుతుందోనని ఆ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. పార్క్ ఆధునీకరణకు 2023 అక్టోబరు 2వ తేదీన అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు చేపట్టాలనే పేరుతో నగరపాలక సంస్థ అధికారులు పార్క్‌ను మూసివేశారు. రూ.2.50కోట్ల నగరపాలక సంస్థ నిధులతో ఆధునీకరణ చేపట్టారు. మూడు నెలల అనంతరం పనులు పూర్తి చేసి జనవరిలో పునః ప్రారంభం చేస్తామని నగర పాలక సంస్థ అధికారులు ప్రకటించారు. అయితే పనులు మొదలు పెట్టి 10 నెలలు పూర్తయినా ఇంకా పార్క్ ప్రారంభం కాకపోవడంతో చిన్నారులు, ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర ప్రజలు ఆనందానికి, ఆహ్లాదానికి వేదికగా నిలిచే దానవాయిపేట గాంధీ పార్క్ సుమారు 10 నెలలుగా మూసివేయడంతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వెళ్లే వృద్ధులు, మహిళలు, యువత పార్కు తెరవకపోవడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని ప్రకటించిన నగరపాలక సంస్థ అధికారులు ఆధునీకరణ పూర్తయిన పార్కును పునః ప్రారంభించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పార్క్ లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం ఎక్కడికో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆధునీకరణ పనులు పూర్తయిన పార్క్‌ను పునఃప్రారంభం చేయడానికి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.


పనులు పూర్తి చేసుకున్న దానవాయిపేట మున్సిపల్ పార్కు


పార్క్‌లోని గాంధీజీ విగ్రహం

కమిషనర్ నివాసం పక్కనే..

దానవాయి పేట మెయిన్‌రోడ్‌లో నివాసం ఉంటున్న నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ బంగ్లాకు గాంధీ పార్కు కూతవేటు దూరంలో మాత్రమే ఉంది. నిత్యం ఈ పార్క్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయానికి రాకపోకలు సాగించే కమిషనర్ పార్కు మూసివేసి 10 నెలలు అవుతున్నా పనులు పూర్తి కాకపోవడంపై ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే పార్కును పునః ప్రారంభించే చర్యలు చేపట్టాలని దానవాయిపేట వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావును వివరణ కోరగా త్వరలో పునఃప్రారంభిస్తామని తెలిపారు.

ఇబ్బంది పడుతున్నాం



నేను నిత్యం వాకింగ్ కోసం గాంధీ పార్క్‌కు వస్తాను. ఈ పార్కు మూసివేయడంతో చాలా ఇబ్బంది పడుతున్నాను. వాకింగ్ కోసం ఎక్కడికో వెళ్లాల్సి వస్తోంది. అంత దూరం వెళ్లలేక ఒక్కోసారి మానేస్తున్నాను. అయినా పార్క్ ఆధునీకరణ పనులు మొదలు పెట్టే సమయంలో మూడు నెలలలో పునఃప్రారంభిస్తామని ప్రకటించిన అధికారులు పది నెలలు పూర్తవుతున్నా ఇంకా ఓపెన్ చేయకపోవడం దారుణం. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– పులగం రామలింగా రెడ్డి, అడ్వకేట్, రాజమహేంద్రవరం

ఇదెక్కడి దారుణమో...



నగర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పార్కును ఆధునీకరించడం సమంజసమైనప్పటికీ 10 నెలలు తరబడి మూసివేయడం దారుణంగా ఉంది. మహిళలు, వృద్ధులు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులో వాకింగ్ చేసే ఎంతో అనుకూలంగా ఉండే పార్కును ఇలా మూసి వేయడం సరైన విధానం కాదు. నిర్మాణం పనులు పూర్తి చేసి పార్కును అందుబాటులోనికి తీసుకురావాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదు. అధికారులు తక్షణ చర్యలు చేపట్టి పార్కును పునఃప్రారంభించాలి.

– కత్రి విశాలాక్షి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

ఇసుక ర్యాంపుల పరిశీలన


కాతేరు ఇసుకర్యాంపులో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులోని ఇసుక ర్యాంపులను ఆదివారం మధ్యాహ్నం ఇన్‌చార్జి ఆర్డీవో కృష్ణనాయక్ పరిశీలించారు. ముందుగా ఆయన ఇసుక అందుతున్న విధానాన్ని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి ఆర్డీవో ఇసుక అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రూ.420కు టన్ను ఇసుకను విక్రయించాలన్నారు. ఇసుక అమ్మకాలు పారదర్శకంగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సాగర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వైకేపీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండలంలో ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతుల రూపంలో అందజేయవచ్చని ఆయన తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ అందుబాటులో ఉంటారన్నారు.

ప్రతి ఇంటికీ సహజయోగ

కడియం: ప్రతి ఇంటికీ సహజ యోగ అవసరమని మాతృశ్రీ నిర్మలాదేవి స్థాపిక సహజ యోగ ట్రస్టు రాష్ట్ర సభ్యులు ఆకుల పట్టాభిరామ్, బోళ్ల పద్మావతి అన్నారు. కడియంలో ఆదివారం నర్సరీని సందర్శించిన వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారపూడి సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. సహజ యోగతో ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి శాఖ సభ్యులు లక్ష్మీ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పచ్చదనం పెంపొందించాలి

కడియం: పాఠశాలల్లో పచ్చదనం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కడియపులంక మాజీ ఎంపీటీసీ, ప్రముఖ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం తనను కడియపులంకలోని నర్సరీలో కలిసిన ఉపాధ్యాయ సంఘం నాయకులతో మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే పచ్చదనం ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. మొక్కలు పెంచేందుకు అనువైన స్థలాలు ఉన్న పాఠశాలలకు నర్సరీ రైతుల సహకారంతో పండ్ల, పూలమొక్కలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు కె.జయరాజు, వి.లజపతిరాయ్, ఎన్.శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు మార్గానిని కలిసిన వారిలో ఉన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ జ్ఞాన తరగతులు

రాజమహేంద్రవరం సిటీ: ఆర్ట్ ఆఫ్ లివింగ్ రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ ఆర్ట్ ఆఫ్ లివింగ్ అడ్వాన్స్‌డ్ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్లు కామాక్షి, శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కృష్ణనగర్ మెడికల్ హాలులో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సాధకులంతా పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు 9391391393, 9949601284 నంబర్లలో సంప్రదించాలన్నారు.

99వ సారి రక్తదానం

ప్రకాశం నగర్: కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన షేక్ మీరావల్లీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటూ అవసరమైన వారికి రక్తదానం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక దానవాయిపేటలో ఉన్న సంజీవని వలంటరీ బ్లడ్ బ్యాంక్‌లో 99వ సారి రక్తదానం చేశారు. మీరావల్లిని పలువురు అభినందించారు.

క్రికెట్ కిట్ అందజేత

తాళ్లపూడి: మలకపల్లి గ్రామ యువకులకు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కుమారుడు ముప్పిడి దరన్ చేతుల మీదుగా ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దిపాటి ప్రకాశరావు, చెరుకూరి వెంకట్రావు, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, కుంటముక్కల ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

రంగంపేట: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్ర రూపం దాల్చింది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో గ్రామ పంచాయతీల అధికారులంతా పారిశుధ్య సమస్యపై దృష్టి సారించాయి. మండలంలోని మర్రిపూడి, పెదరాయవరం, జి.దొంతమూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఏఎంఈ చర్చిలో నిధుల దుర్వినియోగం

- పాస్టర్, ట్రెజరర్‌పై సమగ్ర విచారణ జరపాలి
- చర్చి పరిరక్షణ కమిటీ సభ్యుల డిమాండ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంఈ చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ధవళేశ్వరంలో పురాతనమైన ఏఎంఈ లూథరన్ చర్చిలో క్రైస్తవులు ప్రశాంతంగా ఆరాధన జరుపుకునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారని ధవళేశ్వరం పోలీసులు ఏకపక్షంగా పాస్టర్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడంపై ఏఎంఈ చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కమిటీ సభ్యులు ఎం.ప్రమోద్‌కుమార్, టీపీ మణికుమార్, పాస్టర్ జి.కిరణ్‌బాబు మాట్లాడుతూ చర్చిలో అడ్‌హక్ ప్రాతిపదికన పాస్టర్‌గా పనిచేస్తున్న ఎస్.అనిల్, ట్రెజరర్ జె.ప్రవీణ్ చర్చి నిధులను సుమారు రూ.80 లక్షల వరకు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రతి ఆదివారం ఆరాధన సమయంలో లక్షల రూపాయల కానుకలు వస్తున్నాయని వాటిని చర్చి ఖాతాలోకి జమచేయడం లేదని ఆరోపించారు. దీనిపై తాము తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని, కలెక్టర్ ఆదేశాల మేరకు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్నారన్నారు. పాస్టర్ అనిల్‌కిరణ్, ట్రెజరర్ జల్లూరి ప్రవీణ్ జిల్లా సినడ్ బిషప్, సినడ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ద్వారా ప్రధాన పాస్టర్‌గా నియమితులైన గురువు కిరణ్ బాబు ఆరాధన నిర్వహించకుండా అడ్డుకుంటున్నారన్నారు. నిధులు దుర్వినియోగం చేయడంతో పాటు చర్చి వద్ద అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. దీనితో సంఘస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక రెవెన్యూ అధికారి ఈ వ్యవహారంలోకి దిగి తహసీల్దార్ ద్వారా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధవళేశ్వరం పోలీసులు చర్చి పరిరక్షణ కమిటీ సభ్యులపై పెట్టిన అక్రమ కేసులు తొలగించడంతో పాటు సమగ్ర విచారణ జరిపించి పాస్టర్, ట్రెజరర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బొమ్మూరు సెంటర్‌లో విరిగి పడిన భారీకొమ్మ

రాజమహేంద్రవరం రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బొమ్మూరు సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి భారీ రావి వృక్షం కొమ్మ విరిగి పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రతిరోజు బొమ్మూరు జాతీయ రహదారి మీద నుంచి బాలాజీపేట వైపు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. జనసంచారం సంచరించే సమయంలో భారీ కొమ్మ పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. అర్ధరాత్రి సమయంలో కొమ్మ విరిగి పడడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఆదివారం ఉదయం చేపలమార్కెట్ కావడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి సిబ్బందితో చెట్టుకొమ్మను కోయించి ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలంతా ఊపిరిపీల్చుకున్నారు. విరిగిన చెట్టుకొమ్మను వెంటనే తీసివేయడంతో స్థానిక చేపలు, మాంస, కూరగాయలు వ్యాపారులు యథావిధిగా సాగాయి.

సినిమా టిక్కెట్ ఆన్‌లైన్ కొనుగోలుపై అదనపు చార్జీలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఓటీటీలు వచ్చాక సినిమా థియేటర్లకు అంతంత మాత్రంగా వెళ్లే ప్రేక్షకుడుని ఏవిధంగా పిండాలో ఆ విధంగా పిండేస్తున్నారు థియేటర్ల యాజమాన్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ పేమెంట్ విధానాన్ని ప్రోత్సాహించడంతో నూటికి 90 శాతం మంది ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంలను వినియోగిస్తున్నారు. ఒక కుటుంబం సినిమా థియేటర్‌కు వెళ్లి చూడాలంటే కనీసం రూ.1200 నుంచి రూ.1500వరకు ఖర్చు అవుతుంది. ఇప్పటికే స్నాక్స్, కూల్‌డ్రింక్స్ ధరలతోనే ప్రేక్షకులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పుడు థియేటర్‌కు వచ్చి టిక్కెట్ కొనుగోలు చేస్తే డిజిటల్ విధానంలో పేమెంట్ చేస్తే అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారు. టిక్కెట్ ధర కన్నా ఎందుకు ఇవ్వాలని ఎవరైన ప్రశ్నిస్తే సర్వీసు చార్జిలని కౌంటర్ ఉద్యోగులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం నగరంలో థియేటర్లను పర్యవేక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మామూళ్ల మత్తులో పడి ఇదంతా తమకెందుకులే అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు డిజిటల్ విధానంలో అదనపు వసూళ్లతో పాటు, థియేటర్ల సౌకర్యాలు, క్యాంటీన్లు రేట్ల విషయంపై దృష్టిపెట్టి ప్రజలు జేబుకు చిల్లుపడకుండా చూడాలని సినీ ప్రేక్షకులు కోరుతున్నారు.

రాజకీయ కుట్రలతో ఏపీ భవిష్యత్ అగమ్యగోచరం

- రాజకీయ అవసరాలకు అప్పులిచ్చే కేంద్రం
- అప్పులు తీసుకునే రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం
- ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్


మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రత్యేక హోదా, విభజన హామీలపై చట్టబద్ధమైన హామీ లేని బీహార్ నేతలు ఉద్యమానికి సిద్ధపడుతుంటే ఆంధ్రప్రదేశ్ పాలకులు మోదీకి బాంచన్ అంటున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఖజానాకు పన్నుల రూపంలో వచ్చే ప్రజాధనాన్ని పాలకుల అవినీతి దాహనికి దారి మళ్లించుకుంటు లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి అధికార దుర్వినియోగ అసమర్ధపాలన కారణంగా ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి జీతాలు ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు. అప్పులతో అధికారాన్ని కాపాడుకుంటూ ఆంధ్రప్రదేశ్‌లోని సహజ వనరులు, గ్యాస్ నిక్షేపాలను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారన్నారు. 2014లో అశాస్త్రీయ విభజన జరిగిన నుంచి ఇప్పటి వరకు విభజన చట్టం అమలుపై మోదీని సర్కార్‌ను అడిగే దమ్మున్న ఈ నాటి నేతలు లేదన్నారు. మోదీ సర్కార్ కేంద్రంలో అధికారాన్ని కాపాడుకోవటం కోసం ఆంధ్రప్రదేశ్ పాలకులను భయపెడుతోందన్నారు. గత ప్రభుత్వాన్ని బెదిరించి రాజకీయ మనుగడ సాగించిన మోదీ నేడు చంద్రబాబు పనుల వల్ల ఆంధ్రప్రదేశ్ హక్కులను ప్రశ్నించకుండా కేంద్ర రాజకీయాలను మోదీ శాసిస్తున్నారన్నారు. లక్షల కోట్లు అప్పులు చేస్తు ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తును నీరుగార్చటం సామాజిక ద్రోహంగా భావించాలని, అవినీతి, అప్పులు లేని పాలనను సాగించే రాజకీయ నేతలను నేటి తరం స్వాగతించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆర్పీసి సెక్యూలర్స్ డి.వి.రమణమూర్తి, దూడ్డే త్రినాద్, దూడ్డే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్, మోర్త ప్రభాకర్, వాడపల్లి జ్యోతిష్, బత్తెన శివన్నారాయణ, గుడ్ల దుర్గా ప్రసాద్, కారుమూరి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు తోడ్పాటు అందిస్తా


రచయితల సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రకాశం నగర్: కళాగౌతమి ఆధ్వర్యంలో నిర్వహించే నెలవారీ సాహిత్య కార్యక్రమాలకు తగిన ప్రదేశం ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. కళాగౌతమి రచయితల సమావేశం ప్రతి నెలా రెండో ఆదివారం జరుగుతున్న నేపథ్యంలో సంస్థ వ్యవస్థాపకులు బీవీఎస్ఎస్ మూర్తి అధ్యక్షతన ఆదివారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ 1992లో భానుమతి చేతుల మీదుగా కళాగౌతమి ఆవిష్కరించారన్నారు. సంస్థ తరపున పలు కార్యక్రమాలతోపాటు రచయితల సమితి పక్షాన రచయితల సమావేశం, కళాగౌతమి నెలవారీ మాసపత్రిక ఇలా త్రివేణి సంగమంలా కార్యక్రమాలను చేస్తున్నామని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందిస్తూ, విక్రమ హాలు బాగు చేయించి ఇలాంటి సంస్థల కార్యకలాపాలు నిర్వహించుకునేలా వెసులు బాటు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్య సప్పా దుర్గాప్రసాద్ కళాగౌతమి అధ్యక్షులు పీవీబీ సంజీవ రావు, కార్యదర్శిడా.బీహెచ్‌వీ రమాదేవి పాల్గొన్నారు.

వర్షాలతో నిలిచిన మొక్కల ఎగుమతులు


వర్షపు నీటిలో ఉన్న కడియం ప్రాంత నర్సరీల్లోని మొక్కలు

కడియం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని నర్సరీలు నీట మునిగాయి. రోజంతా వర్షాలు కురుస్తూనే ఉండడం, ముంపు నీరు వెళ్ళే మార్గాలు ఆక్రమణలకు గురవడంతో ఎక్కడికక్కడే పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. సాధారణంగా ఒక మోస్తరు వర్షం కురిస్తే మొక్కల ఎగుమతులు తగు జాగ్రత్తలతో కొనసాగిస్తారు. అయితే మూడు రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడే ఎగుమతులు నిలిచిపోయాయి. సీజన్ ప్రారంభం నుంచి ప్రతి రోజూ 200 నుంచి 300 వరకు వివిధ రకాల వాహనాల్లో మొక్కలను ఎగుమతి చేస్తుంటారు. వర్షాల కారణంగా ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. దీని ప్రభావం రెండు వేల మంది కూలీలకు పనుల్లేకుండా పోయాయి. కాగా ముంపునీటిలో చిక్కుకున్న మొక్కలకు తగిన మైక్రో న్యూట్రియన్స్ అందించాలని ఉద్యానశాఖాధికారులు తెలిపారు. లేక పోతే తెగుళ్ల బారిన పడతాయని వారు వివరిస్తున్నారు.

ఉమాచోడేశ్వరస్వామికి విశేష పూజలు

కొవ్వూరు: స్థానిక పాతూరులోని ఉమా చోడేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం గణపతి పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో కుంకుమ పూజ, స్వామివారికి బిల్వార్చన నిర్వహించారు. పట్టణానికి చెందిన బాలప్ప ప్రసాద్, జానకి దంపతుల చేతులమీదుగా ఈ పూజలు నిర్వహించారు.

కంసాలిపాలెం వంతెనపై రాకపోకల బంద్


కంసాలిపాలెం-మాధవరం వంతెనపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తోన్న ఎర్రకాలువ

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలంలోని కంసాలిపాలెం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామానికి ఆదివారం ఉదయం నుంచీ రాకపోకలు పూర్తిగా నిలచిపోయాయి. గతంలో వంతెన కూలిపోవడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు స్థానిక రైతులంతా కలిసి తూరలు ఏర్పాటు చేసి తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎర్ర కాలువ పోటెత్తడంతో ఈ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో వంతెన వద్ద రాకపోకలు నిలిపి వేశామని సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు.

కాపవరం–ముగ్గళ్ల రహదారికి గండి

- శ్రీరంగపట్నం మీదుగా రాకపోకలు మళ్లింపు
- ఎమ్మెల్యే బత్తుల, ఆర్‌అండ్‌బీ అధికారుల పరిశీలన


బురదకాలువ వరద ఉధృతికి కోతకు గురైన రహదారి

మధురపూడి: వర్షాలకు బురద కాలువ పొంగి ప్రవహిస్తోంది. ఈ వరద ధాటికి కోరుకొండ మండలంలో కాపవరం నుంచి ముగ్గళ్ల వెళ్లే రహదారికి మునగాల వద్ద గండి పడింది. ఆదివారం వాహనాల రకపోకలకు ఇబ్బంది కలిగింది. దీంతో వాహనాలను శ్రీరంగపట్నం మీదుగా మళ్లించారు. ఈ రహదారి గుండా సీతానగరం–కోరుకొండ, రాజానగరం మండలాల ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. కోరుకొండ మండలం మునగాల 3 నుంచి 4 కిలోమీటర్ తోట కాలువ వద్ద వంతెన నిర్మాణ దశలో ఉంది. దీంతో ట్రాఫిక్ డైవర్షన్ వల్ల తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు మొత్తం కొట్టుకుపోవడంతో రాకపోకలను నిలిచిపోయాయి. ఈ ప్రదేశాన్ని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రోడ్లు భవనాల శాఖ ఈఈ ఎస్.బాలవెంకటరెడ్డి, డీఈఈ బీవీవీ మధుసూదనరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ నిర్మాణ దశలో ఉన్న వంతెనకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు వరద ఉధృతికి కోతకు గురైందదన్నారు. వరద తగ్గిన తర్వాత వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అప్పటి వరకూ శ్రీరంగపట్నం మీదుగా రాకపోకలు నిర్వహించాలన్నారు. ఈ కాలువ గంగవరం మండలం నెల్లిపూడి నుంచి గోకవరం, కోరుకొండ మండలాల్లోని గ్రామాల గుండా ప్రవహిస్తూ సీతానగరం మండలం కూనవరం సమీపంలో గోదావరిలో కలుస్తుందన్నారు. కాలువ ఉధృతిని ముందుగా గుర్తించక, ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చిందని, ఇకపై సరైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

375 ఎకరాల్లో వరి పంట నీటమునక

నిడదవోలు రూరల్: భారీ వర్షాలకు మండలంలోని 375 ఎకరాల్లోని వరి పంట నీట మునిగినట్టు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని డి.ముప్పవరం, సమిశ్రగూడెం కలవచర్ల, కోరుపల్లి, కంసాలిపాలెం, సింగవరం, నిడదవోలు గ్రామాల్లో నీట మునిగిన పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. పంట పొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 25 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా పైరుపై వెదజల్లే ప్రక్రియ చేపట్టాలని రైతులకు ఆయన సూచించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లు శివనాగు, మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదల పెంపు

నిడదవోలు: గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దాంతో మిగులు జలాలను జలవనరుల శాఖ అధికారులు ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి ఎప్పటికప్పుడు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 13.72 మీటర్లుగా ఉంది. విజ్జేశ్వరం హెడ్ స్లూయిస్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు ఆదివారం నీటి విడుదలను పెంచారు. దాంతో ఉప కాలువలు గోదావరి జలాలతో కళకళలాడుతున్నాయి. పశ్చిమ డెల్టాకు 6,000, మధ్య డెల్టాకు 1200, తూర్పు డెల్టాకు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 738, నరసాపురం కాలువకు 1534, అత్తిలి కాలువకు 132, తణుకు కాలువకు 100 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	: భారతీయుడు-2
సూర్యమినీ	: కిల్
సూర్యప్యాలెస్	: భారతీయుడు-2
స్వామి	: మహారాజ
శివజ్యోతి	: ఓఎంజీ(ఓమంచి ఘోస్ట్)
అనుశ్రీ	: మనమే(3షోలు), సారంగదరియా(మార్నింగ్‌షో)
రాజా	: కల్కి2898ఏడీ
ఊర్వశి	: భారతీయుడు-2
రంభ	: 14
అప్సర	: కల్కి2898ఏడీ
కుమారి	: రాజుయాదవ్
అశోక నామవరం	: కల్కి2898ఏడీ
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: భారతీయుడు-2
మురళీకృష్ణ కడియం	: కల్కి2898ఏడీ, భారతీయుడు-2
వెంకటసూర్య	: భారతీయుడు-2